## డయల్ యువర్ కలెక్టర్ సమస్యలను

# ప్రాధాన్యతతో పరిష్కరించాలి..

◆ కలెక్టర్ స్మితా సబర్వాల్

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆన్‌లైన్ సిటీ బ్యూరో): డయల్ యువర్ కలెక్టర్ సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ స్మితా సబర్వాల్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులను సమావేశ పర్చి కలెక్టర్ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో తమ సమస్యలు పరిష్కారం కావాలని ఫోన్ చేస్తుంటారని, వారి నమ్మకం, విశ్వాసానికి అనుగుణంగా విజ్ఞప్తులను పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని 0878 - 2262301 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చునన్నారు. ఫోన్ చేసే వారు విధిగా తమ పేరు, ఎక్కడి నుంచి మాట్లాడుతున్నది తదితర వివరాలు తెలిపిన తర్వాత సమస్యను క్లుప్తంగా తెలియజేయాలని సూచించారు. సోమవారం వచ్చిన దరఖాస్తులను బుధవారం లోగా పరిష్కరించాలని అధికారులక సూచించారు. ఓదెల మండలం కొలనూర్ నుంచి వి రత్నమాల మాట్లాడుతూ తనకు 2009లో అభయ హస్తం కింద పెన్షన్ మంజూరైందని, మూడు నెలలు వచ్చి ఆగిపోయిందని తెలుపగా పరిశీలించి చర్య తీసుకుంటామన్నారు. కరీంనగర్‌లోని 23వ డివిజన్ నుంచి సుధాకర్ మాట్లాడుతూ మురికి కాలు వ నీరు రోడ్డుపైకి చేరి ఇబ్బంది కలుగుతోందని తెలుపగా ఇందుకు స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ద్వారా వెంటనే శుభ్రం చేయిస్తామని అన్నారు. ధర్మపురి మండలం చంద్రయ్యపల్లి నుంచి మాట్లాడుతూ స్థానికంగా ఉండే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సరిగా పట్టించుకోవడం లేదని తెలుపగా పరిశీలించి చర్య తీసుకుంటామన్నారు. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి నుంచి అమరిశెట్టి సుధాకర్ మాట్లాడుతూ భూసంబంధ వివాదం ఉందని తెలుపగా తహసీల్దార్‌ను పంపించి పరిష్కరింపజేస్తామన్నారు. కరీంనగర్ మండలం కమాన్‌పూర్ నుంచి మల్లేశ్ మాట్లాడుతూ తన గ్రామంలో ఉన్న భూసంబంధ సమస్యను పరిష్కరించాలని కోరగా ఆర్డీవోకు అప్పీల్ కోసం దరఖాస్తు చేయాలని సూచించారు. అడిషనల్ జాయిం ట్ కలెక్టర్ ఎస్ సుందర్‌అబ్నార్, డీఆర్వో పీబీఆర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

### ప్రజావాణి దరఖాస్తులను..

ప్రజావాణికి సంబంధించిన ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్మితా సబర్వాల్ అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజావాణి దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో 5626 దరఖాస్తులు నమోదై ఉన్నాయని, వీటిలో 1700 దరఖాస్తులను గత వారం రోజుల్లో పరిష్కరించామన్నారు. మిగిలిన దరఖాస్తులన్నింటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను, దరఖాస్తులను శాఖల వారీగా అదే రోజు సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామని, 15 రోజుల్లోగా వాటిని పరిష్కరించాలన్నారు.

గత సోమవారం 44 ఫిర్యాదులు వచ్చాయని, 10 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయని, మిగిలిన 34 దరఖాస్తులను సంబంధిత అధికారులు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు పరిష్కారం కూడా పూర్తిస్థాయిలో న్యాయబద్ధంగా ఉండాలని, 77 శాఖలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఉంచుతామన్నారు. అడిషినల్ జాయింట్ కలెక్టర్ ఎస్ సుందర్ అబ్నార్, డీఆర్ఓ పీబీఆర్ ప్రసాద్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. పవర్‌పాయింట్ ద్వారా ఫిర్యాదులు, దరఖాస్తులు ఏవిధంగా పరిష్కరించాలి, ఏ రీతిలో ఆన్‌లైన్‌లో ఉంచాలనేది వివరించారు.